వ్యవ‘సాయం’ ఎక్కడో..?

దేశానికి అన్నం పెడుతున్న పుడమి పుత్రుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఒక పక్క ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాగునీటి కొరత, మరో పక్క ప్రకృతి వైపరీత్యాలతో కోలుకోలేని దెబ్బ తగులుతోంది. ప్రస్తుతం ఖరీఫ్ పంట పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నారుమడులు వేయడంతో పాటు వరి చేలు దమ్ము చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద ఏడాదికి అన్నదాత సుఖీభవ పేరిట రూ.20 వేలు ఇస్తామని చెప్పటినప్పటికీ అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



శిబ్యాలలో వరినాట్లలో బిజీగా ఉన్న రైతులు

- పెట్టుబడి సాయం అందించని ప్రభుత్వం
- ఇబ్బందులు పడుతున్న రైతన్నలు

రాయచోటి జగదాంబసెంటర్ : రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. సాగు ప్రారంభంలో రైతులకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని గత ఎన్నికల ముందు చంద్రబాబు ప్రకటించినా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే ఎత్తడం లేదు. పీఎం కిసాన్ నిధులు రైతుల అకౌంట్లలో జమవుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు తప్పడంలేదు. డబ్బు జమ చేయకుండానే ఏడాది గడిచిపోయింది. కనీసం ఈ ఏడాదైనా వేస్తారా అని రైతులు ఆశగా ఉన్నారు.

గతమెంతో ఘనం

వ్యవసాయానికి గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. విత్తు నుంచి పంట ఉత్పత్తుల విక్రయం వరకూ అండగా నిలిచింది. పంటల సాగు కోసం ఎలాంటి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందించి ఆదుకుంది. ఏటా క్రమం తప్పకుండా ఈ మొత్తాన్ని అందించింది. పీఎం కిసాన్ సాయం కింద రూ.6 వేలు, వైఎస్ఆర్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి ఏడాదికి రూ.13,500 రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఎలాంటి భూమి లేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతో పాటు అటవీ, దేవాదాయ భూములను సాగుచేస్తున్న వారికి వైఎస్సార్ రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ ఊసే ఎత్తకపోవడంతో అన్నదాతల్లో అసహనం వ్యక్తమవుతోంది. సాగు అంటే విసుగుపుట్టేలా కూటమి ప్రభుత్వం చేస్తోందని రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అప్పు చేయాల్సిన పరిస్థితి



ప్రభుత్వం ఇస్తామన్న పెట్టుబడి సాయం తక్షణమే అందించాలి. పంట పండించి ప్రభుత్వానికి ఇస్తే రెండు నెలలకు గానీ డబ్బు జమ కాలేదు. దీంతో డబ్బుకు వడ్డీ కట్టడానికే సరిపోయింది. తొలకరి సాగు చేయాలంటే మరోసారి అప్పుచేయాల్సిన పరిస్థితి. ప్రభుత్వం స్పందించి పెట్టుబడి సాయం అందించాలి.

\- కెసి రెడ్డయ్యరాజు, రైతు, పత్తిరాజుగారిపల్లి, మట్లి గ్రామం, వీరబల్లి మండలం

పెట్టుబడి సాయం అందించాలి



వర్షాలు సకాలంలో కురవకపోవడంతో ఆ ప్రభావం పంట దిగుబడిపై పడుతోంది. గత సీజన్‌లో వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. తీరా పంట చేతికి వచ్చి పెట్టుబడులు సాగించే సమయంలో వర్షాలు నిరంతరాయంగా పడటంతో ధాన్యం మొలకెత్తి కొనేవారే కరవయ్యారు. పెట్టుబడి సాయం అందించాలి.

\- షేక్ మహబూబ్‌బాషా, రైతు, వండాడి గ్రామం, చిన్నమండెం మండలం

సామాజిక చైతన్యానికే సాంఘిక శాస్త్ర క్లబ్



మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్‌బాబు

రాయచోటి : విద్యార్థులలో సామాజిక స్పృహ పెంపొందించి, చైతన్యపరచేలా సాంఘిక శాస్త్ర క్లబ్ సేవలందించాలని డైట్ ప్రిన్సిపల్ అజయ్‌కుమార్ బాబు అన్నారు. జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్) సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నేతాజీ సాంఘిక శాస్త్ర క్లబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ బాబు మాట్లాడుతూ విద్యార్థులలో చరిత్ర, రాజకీయ, భూగోళ శాస్త్రం, ఆర్థిక వ్యవస్థలపై అవగాహన పెంపొందించేలా క్లబ్ పనిచేయాలని అభిప్రాయపడ్డారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునేందుకు, చరిత్రపై ఆసక్తి పెంపొందించేందుకు, కృత్యాధార బోధనకు క్లబ్ తోడ్పడాలన్నారు. ఓపెన్ స్కూల్ జిల్లా కో–ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు క్లబ్ తోడ్పడాలన్నారు. క్లబ్ అధ్యక్షుడు, సీనియర్ లెక్చరర్ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ సమాజంపై ప్రభావం చూపగలిగే చైతన్యవంతమైన పౌరులను తయారుచేసేలా సేవలందించడమే క్లబ్ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటసుబ్బారెడ్డి, శివ భాస్కర్, గిరిబాబు యాదవ్, శ్రీనివాసులు, శివప్రసాద్, కేదార్నాథ్, ఉషా మాధురి, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాజంపేట : రాజంపేట ఆర్టీసీ డిపోలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం రమణయ్య తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ఈ ప్రోగ్రాం ఉంటుందని, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల ప్రయాణికులు తమ ఆర్టీసీ సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు.

పచ్చిమిర్చి కిలో రూ.100



మార్కెట్లో పచ్చిమిరపకాయలు

రాయచోటి : మార్కెట్లో పచ్చి మిర్చి ధర మండుతోంది. కిలో వంద రూపాయలకు చేరడంతో పేద, మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి. అన్నమయ్య జిల్లాలోని మదనపల్లి, రాయచోటి, రాజంపేట, పీలేరు, కోడూరు మార్కెట్లలో పచ్చి మిర్చి, ఇతర కూరగాయల ధరలు పెరిగాయి. మార్కెట్‌లో బుధవారం కిలో మిర్చి రూ.100, క్యాప్సికం రూ.80, బీర రూ.80, చిక్కుడు రూ.80, గోరు చిక్కుడు రూ.80, టమోటా రూ.50, బెండ రూ.50, ఆలుగడ్డ కిలో రూ.50 ఉన్నాయి. కొన్నిచోట్ల దళారులు, వ్యాపారులు సిండికేట్‌గా మారి ధర పెంచుతున్నారనే ఆరోపణలున్నాయి. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మానవ అక్రమ రవాణా ఒక నేరం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రేఖ

రాయచోటి జగదాంబసెంటర్ : మానవ అక్రమ రవాణా ఒక నేరం అని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రేఖా తెలిపారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా దినం సందర్భంగా రాయచోటి మండలం శిబ్యాలలోని ఏపీ మోడల్ స్కూల్‌లో సమతా ఎన్‌జీఓ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఖైరుణ్ మాట్లాడుతూ పోక్సో చట్టం కింద పదేళ్లకు పైగా జైలు శిక్ష పడుతుందని, పిల్లలను పాఠశాలలో, ఇతర ప్రదేశాలలో వేధించ కూడదన్నారు. అమ్మాయిలకు మంచి మాటలు చెప్పి ఇతర రాష్ట్రాలకు, ఇతర దేశాలకు తరలించి, వారిచే వెట్టిచాకిరీ చేయించడం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని తెలుసుకుని మోసపోకుండా జాగ్రత్త పడాలన్నారు. 1098 టోల్‌ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ కో ఆర్డినేటర్ ఉమాశంకర్‌రెడ్డి, అనిల్, అమృత, వెంకటయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీ4 సర్వే సక్రమంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

చిన్నమండెం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న పీ4 సర్వే కార్యక్రమాన్ని అధికారులు సక్రమంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ తెలిపారు. మండల పరిధిలోని కొత్తపల్లి, మల్లూరు సచివాలయాల్లో బుధవారం పీ4 సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 సర్వేపై పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

టీడీ వ్యాక్సినేషన్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

రాయచోటి టౌన్ : టీడీ(టిటనస్ అండ్ డెఫ్తీరియా) వ్యాకినేషన్‌పై విద్యార్థులంతా అవగాహన కలిగుండాలని డీపీఎంఓ డాక్టర్ రియాజ్ బేగ్ సూచించారు. రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో విద్యార్థులకు టీడీ వ్యాక్సిన్‌పై బుధవారం అవగాహన కల్పించారు. 16 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా టీకా వేశారు. రియాజ్ బేగ్ మాట్లాడుతూ యువత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. టీడీ టీకాలతో టిటనస్, డెఫ్తీరియా వ్యాధుల నుంచి రక్షణ ఉంటుందన్నారు.అనంతరం 100 మందికి టీకాలు వేశారు. కార్యక్రమంలో సూర్జహాన్, చెన్నకేశవప్రసాద్, ఎస్.ఇందిరాప్రియదర్శిని, కె.మేరీమాధురి, ఎస్.నాగసురేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ ఉండాలి



విద్యార్థులకు జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : చదువుతోపాటు క్రమశిక్షణ ప్రతి విద్యార్థికి ఉండాలని రాష్ట్ర క్రీడల, యువజన, రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. రాయచోటి పట్టణం మాసాపేటలోని శివ బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో చదువుపై శ్రద్ధ వహించి భవిష్యత్తు ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ భాస్కర్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా నిమ్మ, చీనీ మొక్కల పంపిణీ



నర్సరీలో చీని, నిమ్మ మొక్కలు

పుల్లంపేట : ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చీనీ, నిమ్మచెట్లు ఉచితంగా అందించనున్నట్లు ఉద్యాన శాఖ అధికారి లోకేష్ తెలిపారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో నాణ్యమైన మొక్కలు రైతులకు అందించేందుకు ఉద్యాన శాఖ కృషి చేస్తుందని తెలిపారు. మొక్కలు కావాల్సిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి

చిన్నమండెం : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ మేనేజర్ నాగలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో జన సురక్ష కార్యక్రమంపై బుధవారం సమావేశం నిర్వహించారు. నాగలక్ష్మి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, సురక్ష బీమా అటల్ పెన్షన్ యోజన, పీఎంజేడీవై పథకాలకు ప్రతి కుటుంబం ఎన్‌రోల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఐడీఎస్‌ప ప్రాజెక్టు కౌన్సిలర్ కవిత, డీఆర్‌డీఏ ఏపీఎం రెడ్డమ్మ, నాగరాజ, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయా ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంపు

రాయచోటి జగదాంబసెంటర్ : 2026–27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపల్ ఎం.గీత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నమయ్య జిల్లా వలసపల్లిలోని పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగ ప్రవేశాలకు డిసెంబర్ 13వతేదీ వరకూ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నివసిస్తూ ఐదో తరగ చదుతున్నవారు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 8919956395, 7013201138 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పంట నమోదు తప్పనిసరి



ఈ పంట నమోదును పరిశీలిస్తున్న సురేష్‌బాబు

చిన్నమండెం : పంటల వివరాలను రైతులు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని రాయచోటి ఉద్యాన అధికారి జి.సురేష్‌బాబు తెలిపారు. మండలంలోని దేవగుడిపల్లె, మల్లూరు గ్రామంలో యాప్ ద్వారా పంట నమోదు ప్రక్రియను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసిన మామిడి, అరటి, బొప్పాయి, నిమ్మ, జామ, దానిమ్మ, నేరేడు, టమాట, మిరప, వంగ, పసుపు, కొబ్బరి ఇతర ఉద్యాన పంటలు, పండ్లు, కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్య పంటల వివరాలను ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. ఈ పంట నమోదైన రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు, మద్దతు ధర, పరిహారం, బీమా, రుణాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది శిరీష, లక్ష్మీ ప్రసన్న, మహర్షి, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న తహసీల్దారు భాగ్యలత

గాలివీడు : మండలంలోని రెవెన్యూ సిబ్బందికి ఏడో మైనర్ ఇరిగేషన్, రెండో వాటర్‌బాడీస్ సెషన్స్‌పై బుధవారం శిక్షణ ఇచ్చినట్లు తహసీల్దారు భాగ్యలత తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ స్టాటికల్ ఆఫీసర్ బి.రామ్మోహన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావుతో కలసి జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ నీటి వనరులపై సమగ్ర సమాచారం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సుస్థిరమైన ప్రణాళిక, పథకాల రూపకల్పనకు శిక్షణ సహాయపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, అసిస్టెంట్ స్టాటికల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న ఎంపీడీఓ జయశ్రీ

పుల్లంపేట : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఎంపీడీఓ జయశ్రీ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు అర్థమయ్యేరీతిలో బోధించాలని సూచించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలన్నారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

వివాహ వేడుకలో ఎమ్మెల్యే



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

నందలూరు : మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన కప్పల వెంకటసుబ్బయ్య అన్న కుమారుడి వివాహ వేడుకలలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. ఆయనతో పాటు భూమన శివశంకర్‌రెడ్డి, అరిగెల సామిత్రి, ఆకేపాటి జగదీశ్వర్‌రెడ్డి, నడివీధి సుధాకర్, గుండు మల్లిఖార్జునరెడ్డి, భూషణ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం నీలిపల్లి గ్రామానికి చెందిన పల్లె నాగయ్యకు ఆరోగ్యం సరిగాలేదని తెలుసుకున్న ఎమ్మెల్యే బాధితుడిని పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయండి

పెనగలూరు : తడి, పొడి చెత్తను వేరుచేయాలని ఎంపీడీఓ విజయారావు సూచించారు. కోమంతరాజుపురం పంచాయతీలో అంబాసిడర్లతో కలిసి చెత్త సేకరణపై ఆయన బుధవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేయాలని, గ్రామాలలో చెత్తలేకుండా చూసే బాధ్యత అంబాసిడర్లదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో రాజంపేట పట్టణాభివృద్ధి

మున్సిపాలిటి కౌన్సిల్‌లో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి



కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి

రాజంపేట : మున్సిపాలిటి కౌన్సిలర్లు, అధికారుల సమన్వయంతో రాజంపేట పట్టణాభివృద్ధి చేయాలని, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కోరారు. మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న పనుల విషయంలో అధికారులతో ఎప్పటికప్పుడు చర్చిస్తూ తమ ఏరియా అభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణలో అధికారులు సక్రమంగా పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజంపేట మున్సిపాలిటి చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులను గుర్తించి, అమలుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. సకాలంలో పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించామని, అవసరమైతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మర్రిరవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి

గాలివీడు : రాష్ట్ర రాజకీయాల్లో నలభై ఏళ్ల అనుభవం ఉందని గొప్పలు చెబుతున్న సీఎం చంద్రబాబు నాయుడు హామీలను అమలు చేయలేకపోతున్నారని రాష్ట్ర వైస్సార్‌సీపీ అధికార ప్రతినిధి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని అరవీడు గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడుతూ బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించి ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం దక్కించుకున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. గత ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో హామీలతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఆ తర్వాత అవన్నీ మరచిపోయిందన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనపై ఆంక్షలు విధిస్తూ కార్యకర్తలు, నాయకులకు నోటీసులు అందించడం రాష్ట్ర ప్రభుత్వానికి సమంజసం కాదన్నారు. ప్రభుత్వాలు కుట్రపూరిత పద్ధతులను మానుకోవాలని హితవు పలికారు. అనంతరం మండల రైతు సంఘం అధ్యక్షుడు గడ్డం రెడ్డప్పరెడ్డిని ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో యదుభూషన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, రెడ్డికుమార్, మాదం భాస్కర్‌రెడ్డి, వైస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

రాయచోటి టౌన్ : అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. రాయచోటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు వివిధ రకాలుగా ఉంటాయని, యంత్రాల వాడకంతోపాటు ఇతర ప్రమాదాలను ఆయన వివరించారు. అంతకు ముందుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.మునియానాయక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం పీవో ఖాజా, వైస్ ఖర్నీ తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఉద్యోగుల డుమ్మా



టక్కోలు సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

సిద్దవటం : మండలంలోని టక్కోలు సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరు కావడంలేదని స్థానికులు తెలిపారు. బుధవారం విధులకు హాజరు కాకపోవడంతో కుర్చీలు ఖాళీగా దర్శన మిస్తున్నాయన్నారు. తన పిల్లలకు తల్లికి వందనం డబ్బు అకౌంట్లో జమ కాలేదని, పది రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నా సిబ్బంది రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాని టక్కోలు ఎస్సీ కాలనీకి చెందిన సాలా వెంకటసుబ్బమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది ఎంత సేపటికీ రాకపోవడంతో దేగనవాండ్లపల్లె, ఖాజీపల్లె గ్రామాల రైతులు తిరిగి ఇళ్లకు వెళ్లిపోయారు. సచివాలయ ఉద్యోగుల్లో పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్ విధులకు హాజరు కావాల్సి ఉందని, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్లు సెలవులో ఉన్నారని పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

ఆస్పత్రి స్థలం హద్దుల ఏర్పాటుకు సర్వే



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

సిద్దవటం : మండలంలోని మాధవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలానికి హద్దులు ఏర్పాటుచేసేందుకు సర్వే నిర్వహిస్తున్నామని సర్వేయర్ సోమశేఖర్ తెలిపారు. విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ మాధవరం పీహెచ్‌సీ స్థలం అన్యాక్రాంతం అవుతోందని వైద్యాధికారి డాక్టర్ శివకుమార్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహసీల్దారుకు ఫిర్యాదు చేశారని తెలిపారు. తహసీల్దారు తిరుమలబాబు ఆదేశాల మేరకు శాఖ రాజుపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెంబర్ 425/1, 425/2లో పీహెచ్‌సీకి కేటాయించిన స్థలంలో సర్వే చేసి మూడు రోజుల్లో నివేదికను పై అధికారులకు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివకుమార్, ఆసుపత్రి అభివృద్ధి సలహా మండలి సభ్యులు సామా శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక



సంతకాలు చేసిన పత్రాన్ని అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం ఎన్నిక బుధవారం జరిగింది. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో కొత్తమాధవరం పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసులను సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఒంటిమిట్ట కార్యదర్శి సుధాకర్, కార్యదర్శిగా పెన్న పేరూరు పంచాయతీ కార్యదర్శి పరిమళ, సంయుక్త కార్యదర్శిగా గొల్లపల్లి కార్యదర్శి సుధారాణి, కోశాధికారిగా కోనరాజుపల్లి కార్యదర్శి సునీల్‌ను ఎన్నుకున్నారు. ఈ సంఘాన్ని ఆమోదిస్తూ మండల సచివాలయ సిబ్బంది సంతకాలు చేసిన పత్రాన్ని ఒంటిమిట్ట ఎంపీడీఓ సుజాతకు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్ష సాధిస్తున్నారు



మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన అనిరుధ్‌రెడ్డి

సంబేపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కక్ష సాధింపు ధోరణితో అక్రమ కేసులు పెడుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరి జి.అనిరుధ్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం తాడేపల్లెలో ఆయన కలిసి జిల్లా పరిస్థితులను వివరించారు. కూటమి ప్రభుత్వం అక్రమకేసులు బనాయిస్తున్నా.. నెరవకుండా పార్టీ బలోపేతానికి కృషిచేస్తామని తెలిపారు.

కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తే పోరాటాలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర, రాష్ట్ర కూటమి ప్రభుత్వాలు కార్మికులను అణగదొక్కే నిర్ణయాలు చేపడుతున్నాయని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హోచిమన్ భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ రంగంలో పనిచేసే కార్మికుడికైనా ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, జీవితాలకు భద్రత కల్పించేలా సేఫ్టీ సౌకర్యాలు కల్పించాలన్నారు.